
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
సోమవారం 23 సెప్టెంబరు 2024





కనుచూపుమేర పచ్చగా వరి పంట



పొట్ట దశకు చేరుకున్న శనిగరం ప్రాజెక్టు ఆయకట్టులోని వరి

సిరుల పంట

కళకళలాడుతున్న వరి చేను

కోహెడ, సెప్టెంబరు 22 : భూమికి పచ్చని పందిరి పరిచినట్లుగా కోహెడ మండలంలో వరి పొలాలు కళకళలాడుతున్నాయి. మండలంలో ఈ సీజన్‌లో వరి సాగు గణనీయంగా పెరిగింది. 25 వేల హెక్టార్ల సాగుభూమి ఉండగా 22,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. 7 వేలు ఎకరాల్లో పత్తి, 450 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 250 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. మండలంలోని శనిగరం మధ్యతర ప్రాజెక్టు కింద 5,100 ఎకరాలు, సింగరయ్య ప్రాజెక్టు పరిధిలో 1500 ఎకరాలను సాగు చేశారు. ఇటీవల ఎడతెరిపి లేని వర్షాలకు శనిగరం, సింగరయ్య ప్రాజెక్టులతో పాటు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉంది. ఈ సీజన్‌లో ఆంధ్ర, ఒరిస్సా కూలీలతో ఎకరానికి రూ.5 వేలు వెచ్చించి నాట్లు వేశారు. ముందస్తుగా వేసిన వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది.

కలిసొచ్చిన వానలు

సీజన్ ప్రారంభంలో వర్షాలు పడ్డా చెరువుల్లోకి నీరు చేరలేదు. పంట క్షేత్రాలకు నీరందించేందుకు రైతులు నానా కష్టాలు పడ్డారు. ఇటీవల కురిసిన వరుణుడు కరుణించాడు. కోహెడ మండలంలో సాధారణ వర్షపాతాన్ని మించి నమోదైంది. దీంతో వరి సాగుకు కలిసొచ్చింది.

29న మరసం వార్షికోత్సవం

హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మరసం ప్రతినిధులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 22 : మంజీరా రచయిత సంఘం(మరసం) 38వ వార్షికోత్సవం ఈ నెల 29న నిర్వహించనున్నారు. మరసం అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, ప్రతినిధులు ఆదివారం వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సిద్దిపేట విపంచి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొంటారన్నారు. ప్రారంభోపన్యాసకులుగా ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, విశిష్ఠ అతిథిగా ప్రఖ్యాత కవి, కబీర్ సమ్మాన్ పురస్కార గ్రహీత శివారెడ్డి, ఆత్మీయ అతిథులుగా మాజీ శాసన సభ్యుడు రసమయి బాలకిషన్, ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నేత విరాహత్ అలీ, తిరుపతిరెడ్డి, పాపయ్య, గ్యాదరి పరమేశ్వర్ హాజరవుతారని వారు తెలిపారు.

మా భూములు మాకు ఇప్పించండి

ఎంపీ రఘునందన్‌రావుకు క్షీరాసాగర్ గ్రామస్థుల వినతి



రఘునందన్‌రావుతో గ్రామస్థులు

ములుగు, సెప్టెంబరు 22 : తమ నుంచి తీసుకున్న భూములను ఇప్పించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును క్షీరాసాగర్ గ్రామస్థులు ఆదివారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా క్షీరాసాగర్ గ్రామానికి చెందిన భూ బాధితులు మాట్లాడుతూ 161 సర్వే నంబర్‌లో కొంతమంది రైతుల నుంచి అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుంటుందని, మాయమాటలు చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేశారని వాపోయారు. ఈ భూములను అప్పటి కలెక్టర్ వెంకట్రామారెడ్డితో మాట్లాడుకుని పట్టా భూములుగా మార్చుకున్నారని ఆరోపించారు. తరువాత వేరే వాళ్లకు అమ్ముకొని డబ్బు సంపాదించారని ఎంపీకి వివరించారు. మా నుంచి తీసుకున్న భూములను ఎలాగైనా ఇప్పించేందుకు కృషి చేయాలని రఘునందన్‌రావును కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భూములను ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

చేప పిల్లలు వదిలేనా?



ముందు చూపులేక పంపిణీలో జాప్యం

- నిండుకుండలా చెరువులు, కుంటలు
- సకాలంలో పూర్తి కాని టెండర్ల ప్రక్రియ
- మూడుసార్లు పిలిచినా కాంట్రాక్టర్ల నిరాసక్తత
- మరింత ఆలస్యమైతే చేపల ఎదుగుదలపై ప్రభావం

దౌల్తాబాద్, సెప్టెంబరు 22 : సమృద్ధిగా వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ మాత్రం ఇంతవరకు ముందు కదల్లేదు. అమలులో తీవ్ర జాప్యం నెలకొన్నది. ఏటా వానాకాలం ప్రారంభానికి ముందే చేప పిల్లల ఉత్పత్తి, పంపిణీ బాధ్యతలను టెండర్ల ద్వారా ముగించేవారు. చెరువులు, కుంటల్లోకి నీరు చేరగానే చేప పిల్లలను వదిలేవారు. జూలై నుంచి సెప్టెంబరు లోగా చెరువుల్లోకి చేప పిల్లలను వదలడం పూర్తయ్యేది. ఈ ఏడాది ఇంత వరకు కనీసం టెండర్ల ప్రక్రియనే ముగియలేదు. అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వ ముందుచూపు లేనితనంతో పథకంపై సందిగ్ధం నెలకొన్నది.



టెండర్లకు ముందుకు రాని కాంట్రాకర్లు

జూన్ మొదటివారం లోగా పూర్తి కావల్సిన టెండర్ల ప్రక్రియపై ఈ ఏడాది కాలాయాపన చేశారు. జూలైలో టెండర్లను ఆహ్వానించాలని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జూలైలో టెండర్ల ప్రక్రియను అయితే ప్రారంభించారు. కానీ, గతేడాది చెరువుల్లో చేప పిల్లలు వదిలిన కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదన్న కారణంతో ఈ ఏడాది ఎవరు ముందుకు రాలేదు. ఆగస్టు 13న మరోసారి టెండర్లను పిలిస్తే ఇద్దరు ముందుకు వచ్చారు. ఇద్దరూ డాక్యూమెంట్లు సరిగ్గా లేకపోవడంతో రిజక్టు అయ్యారు. సెప్టెంబర్ 19న ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. అయితే వారి డాక్యుమెంట్లు వెరిఫికేషన్ కోసం రాష్ట్ర డైరెక్టర్లకు రిపోర్టు చేశామన్నారు.

జిల్లాలో మత్స్యకార సొసైటీలు	369
సొసైటీల్లో సభ్యులు	24,600
గతేడాది వదిలిన చెరువులు, కుంటలు	1637
గతేడాది వదిలిన చేప పిల్లలు	4.28 కోట్లు



మత్స్యకారుల్లో ఆందోళన

మళ్లీ, మళ్లీ టెండర్లు పిలవకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండంతో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీ ఉన్నట్లా..? లేనట్లా..? అన్న అనుమానాలను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినా చేపలను చెరువుల్లో వదిలేసరికి ఇంకా ఒకటి నుంచి రెండు నెలల సమయం పడుతుంది. అప్పట్లోగా వానాకాలం ముగుస్తుంది. అదను దాటడంతో చేప పిల్లలను వదిలినా ఎదిగే అవకాశాలు తక్కువగా ఉంటుందని మత్స్యకారులు వాపోతున్నారు. టెండర్లతో ప్రభుత్వం కాలయాపన చేస్తుండంతో, వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన



ఆలస్యమైతే ఎదుగుదల ఉండదు

సరైనా సమయంలో చేప పిల్లలు పంపిణీ చేయకుండా మత్స్యశాఖ అధికారులు, ప్రభుత్వం మత్స్యకారుల జీవనోపాధిపై నీళ్లు చల్లింది. ఇంతా ఆలస్యంగా పంపిణీ చేసినా చెరువుల్లో నీళ్ల తగ్గి చేప పిల్లల్లో ఎదుగుదల సరిగ్గా ఉండదు. ఇప్పటికైనా త్వరగా పంపిణీ చేయాలి. లేకుంటే ప్రైవేట్‌లో కొనుగోలు చేసి చెరువుల్లో వేసుకొని మత్స్యకారుల జీవన ఉపాధిని మేమే కల్పించుకుంటాం.

- పడిగే కనకయ్య, మత్స్యకారుడు, గాజులపల్లి



ఈ ఏడాది జీవనోపాధి ఎలా?

మత్స్యకార కుటుంబాలు చాలా వరకు వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. అధికారుల జాప్యంతో ఈ ఏడాది వారికి జీవనోపాధి ఎలా? దౌల్తాబాద్ మండలంలో 24 గ్రామపంచాయతీల్లో 30 పెద్ద చెరువులు ఉన్నాయి. లక్ష వరకు చేపపిల్లలను సెప్టెంబరు వరకే వదిలేవాళ్లం. టెండర్లలో కాలయాపన చేయడం సరైంది కాదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి చేపపిల్లలను వదలాలి.

- నర్ర సత్యం, దొమ్మాట సొసైటీ చైర్మన్



ముఖమండపంలోని సీసీ కెమెరా

మల్లన్న ఆలయ ముఖమండపంలో

పటిష్ట నిఘా

ఎనిమిది సీసీ కెమెరాల ఏర్పాటుతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ

చేర్యాల, సెప్టెంబరు 22 : కొమురవెల్లి మల్లన్న ఆలయ ముఖమండపం వద్ద నిఘా కట్టుదిట్టమైంది. ఇటీవల ఎనిమిది సీసీ కెమెరాలను బిగించి నిరంతర నిఘాను ఏర్పాటు చేశారు. ముఖమండపంలో నిత్యం భక్తులు పట్నాలు రచించడం, నిత్య కల్యాణం నిర్వహించడంతో పాటు ప్రత్యేక నిర్ణయ తేదీలలో కానుకలు, ఒడిబియ్యం హుండీ లెక్కింపులు చేపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ సరిగ్గా లేక పనిచేయలేదు. కొద్ది రోజులక్రితం నిర్వహించిన హుండీ లెక్కింపులలో ఓ బంగారు ఉంగరం అపహరణకు గురికాగా, బంగారు గొలుసు చెత్తకుప్పల్లో లభ్యమవడంతో ఒకరిద్దరు ఆలయాధికారులపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. బంగారం, వెండి మొక్కుబడులు ప్రదర్శించిన ప్రదేశంలో బిగించిన సీసీ కెమెరా పనిచేయక రికార్డు కాలేదు. మిగతా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించినా ప్రయోజనం లేక దొంగను గుర్తించలేకపోయారు. ఈ విషయమై ఏఈవో గంగా శ్రీనివాస్‌పై అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం, అంతకు ముందు అతడిపై నెలకొన్న పలు అభియోగాల దృష్ట్యా పోలీసులు కేసు నమోదు చేయడంతో సస్పెన్షన్‌కు గురైన విషయం విధితమే. కాగా గతంలో చిన్నపాటిగా ఉన్న ముఖమండపాన్ని విస్తరించినప్పటికీ సీసీ కెమెరాలు అదనంగా బిగించకపోవడం, విలువైన బంగారు, వెండి మొక్కుబడులు ప్రదర్శించే స్థలం సీసీ కెమెరాలు లేక నిఘా డొల్లగా మారడం పెనుదుమారం రేపింది. దీంతో ఆలయాధికారులు తేరుకుని దిద్దుబాటుచర్యలు చేపట్టారు. ముఖమండపం ప్రాంతమంతా సీసీ నిఘాలో ఉండేలా తాజాగా ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులెవరు వచ్చినా, ఇతరులు ఏం చేసినా సులువుగా కనిపెట్టేందుకు వీలు ఉంది.

నిరంతర నిఘా : ఈవో బాలాజీ శర్మ



హుండీ లెక్కింపులలో చోటుచేసుకున్న పరిణామంతో పాటు ఆలయ ముఖమండపం ప్రాంతం నిఘాలో ఉండేందుకు రూ.50 వేల వ్యయంతో ఇటీవల ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. హుండీ లెక్కింపుల సమయంలో, సాధారణ రోజుల్లోనూ నిరంతర నిఘా కొనసాగించేందుకు దోహదపడుతుంది.



మానిటర్ ద్వారా పర్యవేక్షణ

ఎన్నాళ్లకెన్నాళ్లకు

- వచ్చే నెలలో రేషన్‌కార్డులు జారీ చేసే అవకాశం..ఆరేళ్ల తర్వాత మోక్షం
- ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా మారిన రేషన్‌కార్డు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 22 : కొత్త రేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎట్టకేలకు కొత్త కార్డుల జారీకి మోక్షం లభించనున్నది. రేషన్‌కార్డుతో బియ్యమే కాకుండా సర్కారు అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ స్కీంలకు ప్రామాణికంగా మారింది. ఇటీవల రుణమాఫీ పథకం రేషన్‌కార్డు లేని పట్టాదారులకు వర్తించలేదు. ఆరోగ్యశ్రీ పథకం, గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పింఛన్లు ప్రస్తుతం అమలవుతున్న పథకాల్లోనూ చాలామంది రేషన్‌కార్డు లేక దూరమవుతున్నారు. జిల్లాలో మార్పులు, చేర్పుల కోసం, కొత్త రేషన్‌కార్డు కోసం 32,557 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేస్తే సుమారు మరో 50 వేలకుపైగా కొత్త రేషన్‌కార్డు మంజూరు కానున్నాయి.

ఆరేళ్లుగా నిలిచిన కొత్త కార్డుల జారీ

ఆరేళ్లకుపైగానే కొత్త కార్డుల జారీ నిలిచిపోయింది. కొత్తగా పెళ్లయిన వారు, కుటుంబంలో జన్మించిన పిల్లల పేర్లు నమోదు, మార్పులు, చేర్పులు, కొత్తగా కార్డులు పొందాల్సిన వారంతా ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. వచ్చే నెల 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశలు చిగురించాయి. ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి విధివిధానాలు ఖరారు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.లక్షన్నర, పట్టణాల్లో రూ.2 లక్షల ఆదాయం ఉన్న వారికి రేషన్‌కార్డులు ఇస్తున్నారు. అలాగే 3.5 ఎకరాల్లోపు తరి, 7.5 ఎకరాల్లోపు మెట్ట భూములు ఉన్న వారికి కార్డులు జారీ చేస్తున్నారు. నూతన కార్డుల జారీలో ఆదాయ పరిమితి పెంపుతోపాటు అర్హతలు పునఃసమీక్షించాకే నిర్ణయం తీసుకోనుంది. ఈ క్రమంలో పాత రేషన్‌కార్డుల్లో కోత విధిస్తారా ? కొత్తకార్డుల జారీకి ఎలాంటి ఆంక్షలు విధిస్తారు ? తేలాల్సి ఉంది. క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డులను ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో ప్రతీ రేషన్‌కార్డుదారులకు 90 శాతంపైగా కేవైసీ పూర్తి చేయించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, రేషన్‌కార్డుల జారీపై ఈ నెల చివరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని డీఎస్‌వో తనుజశ్రీ తెలిపారు.



నంబర్‌ప్లేట్ లేని ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పట్టపగలే ట్రాక్టర్లలో తరలింపు 8
వాహనాలకు నంబర్ ప్లేట్లు ఉండవు
మైనర్లతో డ్రైవింగ్ చేయిస్తున్న వైనం
ఫిర్యాదు చేసినా నామమాత్రపు చర్యలు



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

బంగారు చైన్ల దొంగ అరెస్టు

8 తులాల గొలుసులు స్వాధీనం
వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు 7

కొండపాక ఎల్లమ్మ ఆలయంలో చోరీకి విఫలయత్నం

పట్టుకున్న గ్రామస్థులు
పోలీసుల అదుపులో నిందితులు 7

శోభాయమానం



పట్టణంలో అలరించిన కత్తికార్తీక ఫౌండేషన్ వినాయక శోభాయాత్ర

దుబ్బాక పట్టణంలో నిమజ్జనం శోభాయమానంగా జరిగింది. శనివారం రాత్రి ప్రారంభమైన వినాయక విగ్రహాల శోభాయాత్ర ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. పట్టణంలోని 45 విగ్రహాల శోభాయాత్ర గాంధీ నుంచి, బొడ్డురాయిని దర్శించుకుని పెద్దచెరువు వరకు సాగింది. డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్‌లతో దుబ్బాక దద్దరిల్లింది. వాహనాలకు అమర్చిన విద్యుత్‌కాంతుల దగదగల మధ్య యువకులు ఉత్సాహంగా చిందేశారు. విగ్రహాలను పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు కొనసాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, కమీషనర్ రమేష్‌లు పర్యవేక్షించారు.

- దుబ్బాక, సెప్టెంబరు 22



పెద్దచెరువులో నిమజ్జనం చేస్తున్న వినాయక విగ్రహం


చింతచెట్టు కొమ్మకు తగులుతున్న వైర్లు

చెట్టుకు అల్లుకున్న విద్యుత్ వైర్లు

శివ్వంపేట, సెప్టెంబరు 22: చెట్టుకు విద్యుత్ తీగలు అల్లుకుని ప్రమాదం పొంచి ఉన్నదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చండి గ్రామంలో చండికాంబ ఆలయానికి వెళ్లే దారిలోని భారీ చింత వృక్షానికి విద్యుత్ తీగలు అల్లుకుని తరచూ చెట్టుకు షాట్ సర్క్యూట్ సంభవిస్తుందని గ్రామస్థుడు ముత్యంరెడ్డి తెలిపారు. అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిసినప్పుడల్లా చెట్టుకు షాక్ సర్క్యూట్ వస్తుందని, అధికారులు స్పందించి చెట్టుకు అల్లుకున్న విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతున్నారు.

'ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 22: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను వెంటనే మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు సంబంధించిన సబ్సిడీని విడుదల చేయాలన్నారు. అలాగే కొత్తగా దరఖాస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, డివిజన్ నాయకులు రాము, సతీష్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న కలప

- నిబంధనలకు విరుద్ధంగా భారీ డంపింగ్
- అడవి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో అధికారులు


శివ్వంపేట మండలం చండీ సమీపంలో డంపు చేసిన కలప

శివ్వంపేట, సెప్టెంబరు 22 : అధికారుల అలసత్వం కలప దళారులకు వరంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా టన్నుల కొద్ది కలపను రోడ్డుకు సమీపంలో డంపు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారుల ముందే కలప డంపింగ్.. అక్రమ రవాణా సాగుతున్న తమకు పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండల పరిధిలోని మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చండీ గ్రామంలో తూప్రాన్‌కు మండలానికి చెందిన వ్యక్తులు భూమిని అద్దెకు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వందల టన్నుల కలప కొనుగోలు చేస్తూ శనివారం లారీల కొద్దీ కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పట్టించుకునే నాథుడే లేడు. ఈ వ్యాపారం అధికారుల కనుసైగల్లోనే కలప రవాణా సాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని తాళ్లపల్లి తండా, భీమ్లా తండాలో నీలగిరి ప్లాంటేషన్ లో కొందరు అక్రమార్కులు ఫారెస్టు నీలగిరి ప్లాంటేషన్‌లో నీలగిరి చెట్లను సంబంధిత శాఖ క్షేత్రస్థాయి సహాయకులతో కుమ్మక్కై రాత్రి సమయాల్లో చెట్లు నరికివేస్తూ గుట్టచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా కలప రవాణా చేయవద్దనే నిబంధన ఉన్నప్పటికీ అటవీ శాఖ నిబంధనలను


ఇతర ప్రాంతాలకు తరలించేందుకు లారీలో కలపను లోడ్ చేస్తున్న కూలీలు

తుంగలో తొక్కుతూ దళారులు, కలప వ్యాపారులు అధికారులకు ముడుపులు అప్పజెప్పి అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. కలపకు మంచి ధర పలుకుతుండడంతో రోజుకో గ్రామంలో కలప కొనుగోలు సెంట్రల్‌లు పుట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చెట్లు నరికివేస్తూ తరలించడంతో పచ్చదనం లేకుండా పోతుందని చెట్లు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని వృక్ష ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నర్సాపూర్ రేంజ్ ఆఫీసర్ అరవిడ్‌ఉ సంప్రదించగా అనుమతులు లేకుండా కలపను డంపు చేయరాదని, కొనుగోలు చేసిన ప్రతి కలపకు సంబంధించి పూర్తి వివరాలు తెలిపాల్సి ఉందని తెలిపారు. అదేవిధంగా అటవీ శాఖ ఏర్పాటుచేసిన నీలగిరి ప్లాంటేషన్ల నుంచి కలపను తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నిధుల కేటాయింపుపై మంత్రికి కృతజ్ఞతలు

రాయికోడ్, సెప్టెంబరు 22: రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణం కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నిధులు కేటాయిస్తూ జీవో జారీచేయడం పట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలా జీనర్సింహులు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌చారి, తాజా, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ ఆదివారం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా సింగితం గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్థులకు ఇచ్చిన హామీమేరకు రూ.2.45 కోట్ల నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పీఎస్సీ భవనం ఏర్పాటైతే 10 గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, ఎండీ.సుల్తాన్, రాజు, రఫీక్, బాలయ్య తదితరులు ఉన్నారు.

చక్కెర కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం


పవర్ ప్రకాష్(ఫైల్)

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 22: చక్కెర కొనుగోలు నిమిత్తం బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగల్‌గిద్ద ఎస్ఐ బి.సాయిలు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కర్ణాటోని, ఔరాత్ తాలుకా కొరైకల, ఘమా తండా గ్రామానికి చెందిన పవర్‌ప్రకాష్(35) ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం మండల పరిధిలోని ఇరక్‌పల్లి తండా సమీపంలో హోటల్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 10న చక్కెర కొనుగోలు కోసం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పవర్ ప్రకాష్ భార్య మారోనిబాయ్ ఆదివారం నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇంటి స్థలాల కోసం షబ్బీర్‌అలీకి వినతి


షబ్బీర్‌అలీని కలిసిన మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు

జిన్నారం, సెప్టెంబరు 22: బొల్లారం మున్సిపాలిటీలో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రయ్య, గోపాలమ్మ, నాయకులు బషీర్, రవీందర్‌రెడ్డి, రాజునాయక్, సాయివర్మ కలిశారు. స్థానికంగా ఉన్న పేదలకు ఇంటిస్థలాలు కేటాయించాలని కోరగా ఇందిరమ్మ నివాసాల మంజూరీలో మున్సిపాలిటీకి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చినట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు.

ఖేడ్‌లో పరిశుభ్రత పనులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 22: ఖేడ్ పట్టణంలో స్వచ్ఛ తాహీ సేవ-2024లో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత, మాస్ స్కేల్ క్లీన్లీ నెస్‌డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన బాలికల వసతి గృహం సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కార్మికులు, యువకులతో కలిసి తొలగించారు. కార్యక్రమాలను శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్

నారాయణఖేడ్, సెప్టెంబరు 22: వర్షాకాలంలో తాగునీటి కలుషితం, ట్యాంకుల వద్ద అపరిశుభ్రతతో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ఆదివారం ఖేడ్ మున్సిపల్ పరిధిలో కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌ల ఆదేశాలతో క్లోరినేషన్, పరిశుభ్రత పనులను ముమ్మరంగా చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని నీటి ట్యాంకుల్లో కార్మికులు క్లోరిన్ వేశారు. ట్యాంకుల చుట్టూ, వాల్వుల వద్ద పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు.



కామారెడ్డి జిల్లావాసులకు సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ పెద్ద లైన్ పైపు మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ చౌరస్తా వద్ద పగిలిపోయి నీరంతా వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాకు చర్యలు చేపట్టాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. - అల్లాదుర్గం

ఫోన్ పోయిందా.. డోంట్ వర్రీ

- సీఈఐఆర్‌తో గుర్తిస్తున్న పోలీసులు
- బాధితులకు వరంగా పోర్టల్
- మొబైళ్ల రికవరీకి ప్రత్యేక బృందం
- ఈ ఏడాది బాధితులకు 941 సెల్‌ఫోన్ల అప్పగింత
- వారం వ్యవధిలోనే 135 ఫోన్ల రికవరీ


రికవరీ చేసిన సెల్‌ఫోన్లతో సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు(ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 22 : మానవుడి దైనందిన జీవనంలో స్మార్ట్ ఫోన్ ఒక ముఖ్యమైన వస్తువుగా మారి పోయింది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకు స్మార్ట్ ఫోన్‌తోనే గడిపేస్తాం.. ముఖ్యమైన తేదీలు, బ్యాంకు పాస్‌వర్డ్‌లు, అకౌంట్ నంబర్లు, కుటుంబ సభ్యులు, ఇతరుల ఫోన్‌నంబర్లు ఇలా ప్రతిదీ స్మార్ట్ ఫోన్‌లోనే సేవ్ చేసుకుంటాం. అటువంటి స్మార్ట్ ఫోన్‌ను ఎవరైనా దొంగలు కొట్టేస్తే.. జేబులోంచి ఎక్కడైనా పడిపోతే.. ఆ క్షణంలో జీవితమే అంధకారం అయిపోయిందన్న తరహాలో వ్యవహరిస్తాం. పోగొట్టుకున్న ఫోన్ విలువ గురించి కాకపోయినా అందులో ఉన్న కాంటాక్ట్ నంబర్లు, ఇతర వివరాలు పోయాయని బాధపడతాం. ఇక అది సైబర్ నేరగాళ్లకు దొరికితే మాత్రం అంతే సంగతి. ఫోన్‌లోని డాటాను చోరీ చేసి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేస్తారు. ఈ తరుణంలో పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్ దొరికింది... తీసుకెళ్లండి... అని పోలీసుల నుంచి మనకు ఫోన్ కాల్ వస్తే... ఇంకేముంది ఎగిరి గంతేస్తాం. అవును పోలీసు శాఖ కొత్తగా తీసుకువచ్చిన సీఈఐఆర్ పోర్టల్‌తో పోగొట్టుకున్న ఫోన్‌ను మళ్లీ కనిపెట్టవచ్చు.

3501 దరఖాస్తులు.. 1604 ఫోన్ల గుర్తింపు..

సెల్‌ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సీఈఐఆర్ (సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబడుతున్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా వెంటనే ఈ పోర్టల్‌లోకి వెళ్లి ముందుగా ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. సీఈఐఆర్‌లో ఫిర్యాదు నమోదు చేయాలంటే ఫోన్ కొనుగోలు చేసిన బిల్లుతో పాటు సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్లు కూడా తెలిసి ఉండాలి. ఇలా పోర్టల్‌లో దరఖాస్తు చేసిన వెంటనే టెలీ కమ్యూనికేషన్ ద్వారా పోలీసు శాఖలో ఫిర్యాదు నమోదు చేయబడుతుంది. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేయడానికి సంగారెడ్డి జిల్లాలో ఎస్పీ చెన్నూరి రూపేష్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందం నియమించబడింది. ఈ సంవత్సరం జనవరి నుంచి గత నెల వరకు పోర్టల్‌లో 3501 దరఖాస్తులు నమోదుకాగా.. ఇందులో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 1604 ఫోన్లను పోలీసులు గుర్తించగా.. 941 ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఒక్క వారం వ్యవధిలోనే 135 సెల్‌ఫోన్లను పోలీసు ప్రత్యేక బృందం రికవరీ చేసింది.


బాధితుడికి ఫోన్‌ను అప్పగిస్తున్న పోలీస్ ఫొటోగ్రాఫర్ చిరంజీవి (ఫైల్)

వ్యక్తిగత సమాచారం ఫోన్‌లో పెట్టుకోవద్దు : ఎస్పీ చెన్నూరి రూపేష్

మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఇతర వివరాలు ఫోన్‌లో సేవ్ చేసుకోకపోవడమే ఉత్తమం. అప్పుడే సైబర్ నేరగాళ్ల నుంచి తప్పించుకోగలం. లేకపోతే ఫోన్‌లోని డాటాను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు మన డబ్బులు కాజేసే అవకాశం ఉంది. సెల్‌ఫోన్లలో వ్యక్తిగత సమాచారం పెట్టుకోవద్దు. ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేయడానికి ప్రత్యేక బృందం విశేషంగా కృషి చేస్తుంది. ఇటీవలే జిల్లాలో మొబైల్ రికవరీ మేళా నిర్వహించి పెద్ద ఎత్తున సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించాం.

నిజాయితీ చాటుతున్న పోలీసులు

జిల్లాలలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు నేనున్నాంటూ జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ చేస్తున్న కృషిని చూసి పోలీసులు, సిబ్బంది కూడా ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొని నిజాయితీని చాటుతున్నారు. విలువైన ఐఫోన్‌లు పోలీసులకు వివిధ సందర్భాల్లో రోడ్లపై దొరికితే వాటిని తమ వద్ద ఉంచుకోకుండా వాటి యజమాని ఎవరనేది గుర్తించి వారికి అప్పగిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని రెడ్లాస్ హోటల్ వద్ద ఆగస్టు 19వ తేదీన రోడ్డుపై రూ.30వేల విలువగల ఫోను పోలీస్ ఫొటోగ్రాఫర్ చిరంజీవికి దొరికింది. ఆ ఫోన్ పోగొట్టుకున్న యజమానిని గుర్తించి తిరిగి అతనికి అప్పగించారు. అలాగే సంగారెడ్డి రూరల్ పోలీసులు మహేందర్, లక్ష్మణ్‌లు ఆగస్టు 23వ తేదీన రాత్రి విధులు నిర్వహిస్తుండగా రూ.70వేల విలువైన ఒక ఐఫోన్ దొరకగా. యజమానిని గుర్తించి అప్పగించారు.



బాధితుడికి ఫోన్‌ను అప్పగిస్తున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు మహేందర్, లక్ష్మణ్ (ఫైల్)

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య


సుమలత (ఫైల్)

కోహెడ, సెప్టెంబరు 22 : భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన వంగ బాలరాజుకు దూలిమిట్ట మండలం కూటికల్ గ్రామానికి చెందిన కూరెళ్ల సుమలత(32)తో 2009లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు అక్షయ్, కూతురు తేజస్విని ఉన్నారు. నాలుగేళ్లుగా భార్యాభర్తల మధ్య సంసారం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. చాలాసార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ కూడా నిర్వహించారు. కాగా, ఈ నెల 21న కూడా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన సుమలత ఇంట్లో ఉరివేసుకున్నది. దీంతో వెంటనే ఆమెను సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి అన్న కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దార్యప్తు చేస్తున్నారు. బావ బాలరాజు, ఆడబిడ్డలు కోల పద్మ, తోర్నాల రాజవ్వ కలిసి సుమలతను నిత్యం మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పెట్టేవారిని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి..

చేర్యాల, సెప్టెంబరు 22 : కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన తాడూరి మల్లేశం (52) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో మనోవేదనకు గురైన మల్లేశం శనివారం సాయంత్రం వ్యవసాయబావి వద్ద పురుగులమందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మొదట చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచనమేరకు సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

శివ్వంపేట, సెప్టెంబరు 22 : తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని వివాహం చేసుకున్న ప్రేమ జంట శివ్వంపేట పోలీసులను ఆశ్రయించింది. ప్రేమికులు తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ మండలం తునిక్కాల్స్ గ్రామానికి చెందిన సంగీత, గోమారం గ్రామానికి చెందిన మంచోళ్ల సతీష్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. దీంతో గత గురువారం హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్నారు. అమ్మాయి తల్లిదండ్రుల నుంచి ఇబ్బందులున్నాయని, తమకు రక్షణ కల్పించాలని శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డిని ఆశ్రయించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి


మృతి చెందిన పాడిగేదెలు

నారాయణఖేడ్, సెప్టెంబరు 22: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట శివార్లలో విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి చెందాయి. బాధితులు గాండ్ల సతీష్, శివ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం రోజుమాదిరిగానే ఆదివారం వారు 20 పాడి గేదెలను మేతకు డిపో సమీపంలోని వ్యవసాయ భూముల్లోకి తీసుకెళ్లారు. అక్కడ గోతిలో నీరునిల్వ ఉండడంతోపాటు పక్కనే విద్యుత్ స్తంభం ఎర్తింగ్ వైరు ఉంది. గేదెలు మేసుకుంటూ వెళ్లి వైర్‌కు తగలడంతో కరెంట్ షాక్‌కు గురై ఆరు మృతి చెందాయి. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం


మృతదేహన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 22: రాజీవ్ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఉదయం 10 గంటలకు కుకునూరుపల్లిలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్ వద్ద పని చేస్తుండగా సిబ్బందికి వృద్ధురాలి మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలికి 70 నుంచి 80 సంవత్సరాల వయస్సు, ఎత్తు ఐదు అడుగులు ఉంటుందని పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఎంపీవో మృతి


కవికుమార్ (ఫైల్)

అక్కనపేట, సెప్టెంబరు 22: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న కవి కుమార్ (55) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతిపై ఎంపీడీవో బానోతు జయరాం, మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీబీనాయక్ సంతాపం వ్యక్తం చేశారు. కవికుమార్ స్వగ్రామమైన హన్మకొండకు మండల అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు వెళ్లి ఆయన మృతదేహనికి నివాళులర్పించారు.

రోడ్డుప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

చేర్యాల, సెప్టెంబరు 22 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మురళి (50), భార్య శైలజతో కలిసి ఆదివారం చుంచనకోట గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. రాత్రి బైకుపై కిష్టంపేటకు ఇద్దరు తిరిగివస్తుండగా, గ్రామశివారులోని దీకొండ మైసమ్మ సమీపంలో బైకు అదుపుతప్పి చెట్టుకు ఢీ కొన్నది. ఈ ఘటనలో మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన శైలజను చికిత్స నిమిత్తం స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మురళి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు కేరళ స్కూల్ విద్యార్థిని


వైష్ణవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 22: వికాస తరంగిణీ, ట్రస్మా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చినజీయరస్వామి ఆశ్రమంలో ఈ నెల 21న నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు విద్యార్థిని సత్తాచాటింది. 8వ తరగతి చదువుతున్న వైష్ణవి ద్వితీయ స్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవిని కరస్పాండెంట్ ఆలే శైలేందర్, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో ఖేడ్ చిన్నారులకు బ్లాక్‌బెల్ట్


బ్లాక్ బెల్ట్ సాధించిన ఖేడ్ చిన్నారులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 22: దక్షిణ కొరియాకు చెందిన తైక్వాండో బెల్ట్ కరాటే పోటీల్లో నారాయణఖేడ్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు బ్లాక్ బెల్ట్ సాధించారని కోచ్ రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులు ఆకర్షరెడ్డి, అనిరుధ్‌కుమార్, గణేష్‌కుమార్ హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


బూచనెల్లి నాగమ్మ మృతదేహం

న్యాల్‌కల్, సెప్టెంబరు 22 : పిడుగుపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని న్యామ్తాబాద్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బూచనెల్లి నాగమ్మ(41) రోజు మాదిరిగానే తన పొలంలో పనులను ముగించుకుని ఇంటికి వస్తున్నక్రమంలో గ్రామసమీపంలోని ఓ క్వారీ వద్ద పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఇదే దారిగుండా ఆటోలో వస్తున్న కొందరు నాగమ్మ కింద పడి ఉండడాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామస్థులు అక్కడికి వెళ్లి చూడగా బూచనెల్లి నాగమ్మగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు హద్నూర్ ఎస్ఐ రామునాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండపాక ఆలయంలో చోరీకి విఫలయత్నం

కొండపాక, సెప్టెంబరు 22 : కొండపాకలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చోరీకి విఫలయత్నం జరిగింది. వివరాల్లోకి వెళితే కొండపాక గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో శనివారం రాత్రి సుమారు 11.30లకు ఇద్దరు వ్యక్తులు దేవాలయ ఆవరణలో ఉండగా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వ్యవసాయ పొలం పనులకు వెళ్తూ గమనించారు. అనుమానం వచ్చి వారి వద్దకు వెళ్లి ప్రశ్నించగా మేము దేవాలయంలో నిద్ర చేయడానికి వచ్చామని చెప్పారు. అనుమానం వచ్చి గట్టిగా నిలదీయగా.. కత్తితో బెదిరించారు. దీంతో భయానికి గురైన వారు గ్రామంలోకి విషయం తెలుపగా కొంతమంది ఆలయానికి వెళ్లే దారుల వెంట కాపలా కాగా, మరికొంతమంది దేవాలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే దొంగలు గల్లాపెట్టెను పగులగొట్టి చోరీకి పాల్పడుతుండగా గ్రామస్తులు పట్టుకొని వివరాలను ఆరాతీశారు. అందులో ఒకరిది కుకునూరుపల్లి, మరొకరిది కిష్టాపూర్ అని తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దొంగలను పీఎస్‌కు తరలించారు. అయితే ఈ విషయంపై కుకునూరుపల్లి పోలీసులను సంప్రదించగా సమాధానం దాటవేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఎప్పుడో..?

మనోహరాబాద్, సెప్టెంబరు 22: నాయకుల అలసత్వం.. అధికారుల పట్టింపు లేని తనం వెరసి.. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఆలస్యమవుతున్నది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని గౌతోజీగూడెం, పోతారం, పర్కిబండ గ్రామాల్లో ఈనెల 11న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొనాల్సి ఉండగా... సొంత బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరూ రాకపోవడంతో కాంగ్రెస్ నాయకుల సూచన మేరకు కార్యక్రమం రద్దు చేశారు. దీంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే సునీతారెడ్డి గౌతోజీగూడెంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం పోతారం, పర్కిబండ, గౌతోజీగూడెం గ్రామాలకు చెందిన 16 చెక్కులు, 41 ఇతర గ్రామాల చెందిన చెక్కులు.. మండల కేంద్రంలో మొత్తం 57 కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు రోజూ మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. అధికారుల ఆదేశాల మేరకు త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు.

బంగారు చైన్ల దొంగ అరెస్టు

- 8 తులాల బంగారు గొలుసులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట ఏసీపీ మధు



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 22 : మూడు రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని నగల దుకాణంలో జరిగిన చోరీని పోలీసులు చేధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ మధు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం చెందిన వెపంచ షణ్ముఖరెడ్డి జల్సాలకు అలవాటు పడి డబ్బులు కోసం బంగారం దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే హైదరాబాద్‌లో చోరీకి పాల్పడితే సులువుగా దొరికిపోతానని గ్రహించిన అతను సిద్దిపేటను ఎంచుకున్నాడు. ఈ మేరకు ఈ నెల 18న హైదరాబాద్‌లోని తన స్నేహితుడి వద్ద మోటార్ సైకిల్ తీసుకుని సిద్దిపేటకు చేరుకున్నాడు. పట్టణంలోని లాల్ కమాన్ సమీపంలో ఉన్న నయీం మియా బంగారం షాపులోకి వెళ్లి బరువు ఎక్కువ ఉన్న చైన్లు చూపించమని అడగగా యజమాని ఒక ట్రేలో ఐదు బంగారు చైన్లు పెట్టాడు. వాటిని చూస్తున్నట్లు నటించిన షణ్ముఖరెడ్డి ట్రేతో సహా చైన్లను తస్కరించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. చోరీ సొత్తుతో బైకుపై హైదరాబాద్ వైపు వెళ్తుండగా టోల్‌గేట్ సిబ్బందిని చూసి పోలీసులు అనుకొని వేగంగా వెళ్లే క్రమంలో కింద పడి గాయాలపాలయ్యాడు. దీంతో టోల్‌గేట్ సిబ్బంది అతడికి ప్రథమ చికిత్స చేసి పంపించారు. ప్రజ్ఞాపూర్‌లోని కనకదుర్గ పార్కింగ్ సెంటర్‌లో బైక్‌ను పార్కు చేసి హైదరాబాద్ వెళ్లాడు. చోరీ సొమ్మును కరీంనగర్‌లో అమ్మాలని నిర్ణయించుకున్న అతడు శనివారం ఉదయం ప్రజ్ఞాపూర్‌లో పార్కు చేసిన బైక్ తీసుకుని బయలుదేరాడు. కాగా, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజ్, టెక్నాలజీ ద్వారా నిందితుడి కదలికలు గమనించి రంగీలా దాబా చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇది గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి అదుపులోకి తీసుకున్నారు నిందితుని నుంచి మొత్తం 8 తులాల 5 బంగారు చైన్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఎస్ఐ వెంకట్ రెడ్డి, సిబ్బంది సుధాకరెడ్డి, ప్రశాంత్, యాదగిరి, ప్రవీణ్‌లను సీపీ అభినందించారని, త్వరలో రివార్డు అందజేస్తారని ఏసీపీ తెలిపారు.

రాజ్యాధికారం వశపర్చుకుందాం..!

- రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం
- జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్
- రామాయంపేటలో కదం తొక్కిన ముదిరాజ్‌లు


రామాయంపేట సభలో మాట్లాడుతున్న కాసాని వీరేష్

రామాయంపేట, సెప్టెంబరు 22 : ఐక్య ఉద్యమాలతో రాజ్యాధికారం వశపర్చుకుందామని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి మనవాళ్లని గెలిపించుకుందామన్నారు. జిల్లా స్థాయి ముదిరాజ్ మహాసభ ఆదివారం రామయంపేటలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ముదిరాజ్ బలగం భారీ బైకు ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నది. ఈ సభకు జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు అధ్యక్షత వహించగా.. కాసాని వీరేశ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 60 లక్షల మంది ఉన్న ముదిరాజ్ లకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఈసారి జరిగే ఎన్నికల్లో మన ఓటు మనమే వేసుకునేలా చైతన్యం రగిలించాలన్నారు. అపుడే బలమైన నాయకత్వం ఏర్పడి మన హక్కులు చేజిక్కించుకోవచ్చన్నారు. సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సఫాన్ దేవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, యువత జిల్లా అధ్యక్షుడు పురం రవి, ఓయూ విద్యార్థినేత అల్లుడు జగన్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమార్, ఐలయ్య, చిలుక గంగాధర్, పోచమ్మల అశ్విని పాల్గొన్నారు.


చేగుంట : సభకు వెళ్తున్న ముదిరాజ్‌లు

తరలిన ముదిరాజ్‌లు..

చేగుంట, సెప్టెంబరు 22: చేగుంట, నార్సింగి, మండలాల నుంచి చలో ముదిరాజ్ చలో రామాయంపేట్ మెదక్ జిల్లా ముదిరాజ్ ముఖ్యనాయకుల సమావేశానికి ఆదివారం ముదిరాజ్ ముఖ్య నాయకులు భారీగా బయలుదేరారు. తరలివెళ్లినవారిలో చేగుంట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

పేకాట ఆడుతున్న పలువురి అరెస్ట్

చేర్యాల, సెప్టెంబరు 22 : చేర్యాల పట్టణ శివారు పెద్దమ్మగడ్డ శివారుతో పాటు ముస్త్యాల గ్రామశివారులోని ఓ ఫాంహౌజ్ వద్ద పేకాట ఆడుతున్న పలువురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీరేశ్ తెలిపారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.18,500తోపాటు ఆరు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

చేర్యాల, సెప్టెంబరు 22 : మండలంలోని కడవేరుగు గ్రామశివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కొమ్మినేని కిషన్ (30) దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్లితే పోతిరెడ్డిపల్లి గ్రామం నుంచి బైకుపై వస్తుండగా, గ్రామశివారులో బైక్ అదుపుతప్పి కిందపడింది. దీంతో కిషన్‌కు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ నీరేశ్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

జహీరాబాద్‌లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

జహీరాబాద్, సెప్టెంబరు 22: జహీరాబాద్ పట్టణంలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. మంజీరా, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో మాణిక్‌ప్రభుమహేలా, పస్తాపూర్, మహీంద్రా కాలనీ, డ్రైవర్స్ కాలనీ, అల్లీపూర్, తదితర ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి కోసం తాము వివిధ ప్రాంతాల్లో గల కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఆయా కాలనీల్లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలంటూ ప్రతిరోజు మున్సిపల్ అధికారులకు విన్నవిస్తున్నా ప్రయోజనం కరువైందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

స్తంభాలు వేసుకున్నాం.. కనెక్షన్ ఇవ్వండి సారూ..

- కరెంట్ వైర్లు బిగించడంలో తీవ్ర జాప్యం
- రాత్రిల్లో టార్చ్ లైట్లు, నూనె దీపాలే దిక్కు
- కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ ఎస్సీల ఆవేదన


ఖాళీగా విద్యుత్ స్తంభాలు

కోహీర్, సెప్టెంబరు 22 : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ఈ కాలనీకి కరెంటు ఇవ్వాలని గతంలో స్థానికులు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నారు. స్తంభాలు లేవు కనెక్షన్ ఇవ్వడం సాధ్యం కాదని, సొంతంగా ఏర్పాటు చేసుకుంటే తీగలు బిగించి విద్యుత్ సరఫరా చేస్తామని వారు బదులిచ్చారు. దీంతో చేసేదేమీ లేక కాలనీవాసులు తలాకొంత డబ్బు వేసుకుని రూ.18000 వ్యయంతో మూడు స్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. అయినా అధికారులు కనెక్షన్ ఇచ్చేందుకు చొరవ చూపడం లేదు. దీనిపై వారిని నిలదీస్తే ప్రభుత్వం విద్యుత్ తీగలను సరిపడా సరఫరా చేయడం లేదని బాధ్యతారహితంగా సమాధానాలు చెబుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఓవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరెంటు లేని గ్రామాలు ఉండకూడదనే లక్ష్యంతో గ్రామీణ విద్యుద్దీకరణకు కోట్ల రూపాయలు మంజూరు చేస్తుంటే.. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నదని స్థానికులు మండిపడుతున్నారు. విద్యుత్ కనెక్షన్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాత్రిల్లో టార్చ్ లైట్, దీపాల వెలుగుల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నామని, ఎప్పటికైనా స్పందించి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



కాలనీకి కరెంటు సరఫరా లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారుల సూచనమేరకు సొంత డబ్బులతో స్తంభాలు ఏర్పాటు చేసుకున్నా అధికారులు కనెక్షన్ ఇవ్వడం లేదు. పలుమార్లు విద్యుత్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీకి కరెంటు సరఫరా చేయాలి.

-ప్రవీణ్, నాగిరెడ్డిపల్లి వాసి

హరితహారం చెట్లపై గొడ్డలివేటు

● విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్నాయని నరికివేత



నరికివేసిన చెట్ల మొదళ్లు

చేర్యాల, సెప్టెంబరు 22: చేర్యాల మండలం వేచరేణి శివారు ఎల్లదాసునగర్ కాలనీ సమీపంలో చేర్యాల-కొమురవెలిల ప్రధాన రహదారి పక్కన హరితహారం మొక్కలు ఏపుగా పెరిగాయి. విద్యుత్ తీగలకింద ఉన్నాయన్న కారణంతో ఇటీవల పదికిపైగా చెట్లను నరికివేశారు. కొమ్మలు తొలగించాల్సి ఉన్నప్పటికీ మొత్తం నరికివేయడంతో మళ్లీ చిగురించుకుని ఏపుగాపెరిగేందుకు చాలాకాలం పట్టనుంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యామ్నాయచర్యలు చేపట్టి కొమ్మలు నరికివేయకుండా, మొండి చెట్లుగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా!

● పట్టపగలే ట్రాక్టర్లలో తరలింపు
● వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండవు
● మైనర్లే డ్రైవర్లు!

చిన్నకోడూరు, సెప్టెంబరు 22: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాలకు పట్ట పగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నది. సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడం తోనే కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అక్రమార్కులు అదును చూసి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరిహద్దు మండలాలైన కోహెడ, బెజ్జంకి మండలాల నుంచి వ్యాపారులు ఇసుకను మండలంలోని పలు గ్రామాలతో పాటు, సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నెంబరు ప్లేటు లేని వాహనాల్లో...

గుట్టు చప్పుడు కాకుండా నెంబరు ప్లేటు లేని వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారం లాభసాటిగా మారడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా మండల సరిహద్దు దాటుకుని రోజుకు పదుల సంఖ్యలో ఇసుక వాహనాలు వెళ్తున్నాయి. ఇసుకను తరలిస్తున్న వాహనాలను ఎక్కువగా మైనర్లే నడుపుతున్నారు. ఇసుక వాహనాలను డ్రైవర్లు అతి వేగంగా నడపడం వల్ల ఇతర వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఓవర్ స్పీడ్‌తో వస్తున్న ఇసుక వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలను మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న పట్టించుకోనే నాథుడేలేడని, పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేసి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



నెంబర్ ప్లేటు లేని ట్రాక్టర్‌లో తరలుతున్న ఇసుక

'మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితం'



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌గౌడ్

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 22: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్‌గౌడ్ పేర్కొన్నారు. అనిల్‌గౌడ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. బలహీన వర్గాల నాయకుడిగా ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు పొన్నం అన్నారు. పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. మంత్రి ప్రభాకర్‌పై విమర్శలు చేస్తే అదేస్థాయిలో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నాయకులు పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్, గంపల శ్రీనివాస్, పిల్లి తిరుపతి, గిరిజన నాయకులు బిక్యానాయక్ తదితరులు ఉన్నారు.

కడవేరుగు శివారులో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

● సీపీఎం నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 22: చేర్యాల మండలం కడవేరుగు శివారులో వరదనీటి ప్రవాహ ముంపు బెడద నివారణకు వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం వరదనీటిలో నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ.. ప్రతీ ఏటా వర్షాకాలంలో కడవేరుగు శివారులోని చెరువు మత్తడి నీటితో పాటు వరదనీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుచేసినా పనులు త్వరితగతిన ప్రారంభించకపోవడంతో నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మాణంపై హామీఇచ్చినా పట్టించుకోకపోవడం తగదన్నారు. వెంటనే స్పందించి పనులు త్వరితగతిన ప్రారంభించి ఇబ్బందులు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొనుగోటి శ్రీనివాస్‌రెడ్డి, గొర్రె శ్రీనివాస్, కనకయ్య, రమేశ్, సత్తయ్య, చంద్రం, బాలు, ప్రకాశ్, రాజు, మహేశ్, పోచయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.



వరదనీటిలో నిరసన తెలుపుతున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 22: కాంగ్రెస్‌తోనే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి పర్వతాలు యాదవ్ నర్సారెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. ఆయనవెంట ఏఎంసీ వైస్ చైర్మన్ సరార్‌ఖాన్, నక్క రాములు, నాయకులు సమీర్, కరుణాకర్‌రెడ్డి, జహీర్, శివరాంరెడ్డి, రేగొండ, అజ్గర్ తదితరులున్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బోగరి సుమిత్ర కుటుంబాన్ని తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సయ్యద్ మతీన్, శివరాంరెడ్డి ఉన్నారు.

గురుకుల విద్యకు కాంగ్రెస్ సర్కారు ప్రాధాన్యతనిస్తున్నదని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని, గాలి మాటలతో పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. పనికిరాని, పనిలేని బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, జగదేవ్‌పూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహారెడ్డి, వహీద్, యాదయ్య, నక్క రాములు, సమీర్, అజ్గర్, మోహన్, కరుణాకర్, ప్రవీణ్, సురేశ్ తదితరులున్నారు.



గజ్వేల్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న నర్సారెడ్డి

● **జగదేవ్‌పూర్:** మండలంలో మృతి చెందిన పలువురి కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి పరామర్శించారు. ఆయనవెంట గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు జనార్దన్‌రెడ్డి, కరుణాకర్, రాజేందర్ రెడ్డి తదితరులున్నారు.

● **కుకునూరుపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ముద్దాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ సబ్సిడీ పొందిన లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజు, శ్రీనివాస్, లింగం, కరుణాకర్, సాయి, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘాలు ఆర్థికంగా బలపడాలి

● రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్

చేర్యాల, సెప్టెంబరు 22: చేపపిల్లల పెంపకంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మత్స్యసహకార సంఘాలు ఆర్థికంగా బలపడాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ సూచించారు. కొండపాక మత్స్య సహకార సంఘాల కంపెనీ ఆధ్వర్యంలో కొమురవెల్లి మండలకేంద్రంలోని చెరువులో పెంపకం కోసం చేపపిల్లలను ఆదివారం వదిలిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్స్యసహకార సంఘాలను మత్స్య రైతుల ఉత్పత్తిదారుల సంస్థలుగా రూపుదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రత్యేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అందుకు కొండపాక ఎఫ్ఎఫ్‌పీవో ఆదర్శవంతంగా వ్యవహరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస బిక్షపతి, కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో నారదాసు ఈశ్వర్, చైర్మన్ సార్ల కిష్టయ్య, ముదిరాజ్‌సంఘం మండలాధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య, నాయకులు బాలయ్య, శ్రీనివాస్, స్వామి, కనకయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

'సన్మానాలు బాధ్యతలు పెంచుతాయి'

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 22: సన్మానాలు, అవార్డులు బాధ్యతలు పెంచుతాయని డీఎస్ఎం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మిద్దెల యాదగిరి పేర్కొన్నారు. ది బెస్ట్ ఎడ్యుకేటర్, కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ అవార్డును ఇటీవల హైదరాబాద్‌లోని ఓ హోటల్లో అందుకున్న ఆయన్ను సెక్రటేరియట్ పీఆర్‌వో సాతర్ల మహేష్ పాఠశాల ఆవరణలో ఆదివారం సన్మానించారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం

● మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్



ఏఎస్ఐ జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

మద్దూరు, సెప్టెంబరు 22: ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని, విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి ప్రజాభిమానం సంపాదించుకోవడం అభినందనీయమని ఎస్ఐ షేక్ మహబూబ్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన జగదీశ్వర్ బదిలీపై సిద్దిపేట ట్రాఫిక్ విభాగానికి వెళ్తున్న సందర్భంగా ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బంది శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు బాధ్యతయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, రైటర్ సిద్ధార్థ్, శివ, నరేష్, పరుశురాం, మహేందర్, సురేష్ ఉన్నారు.

'పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి'

మద్దూరు, సెప్టెంబరు 22: ప్రజలు పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ షేక్ మహబూబ్ సూచించారు. మండలంలోని నర్సాయపల్లిలో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో శనివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను విడనాడాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, బిక్షపతి, ఏఎస్ఐ జగదీశ్వర్ ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ములుగు మండల అధ్యక్షుడిగా గోపాల్ గుప్తా



నియామకపత్రం అందుకుంటున్న గోపాల్‌గుప్తా

ములుగు, సెప్టెంబరు 22: ఆర్యవైశ్య సంఘం ములుగు మండల అధ్యక్షుడిగా దోసపాటి గోపాల్‌గుప్తా ఎన్నికయ్యారు. మహాసభ సీనియర్ నాయకుడు రంగయ్యగుప్తా, హరినాథ్‌గుప్తా చేతులమీదుగా ఆదివారం గోపాల్ గుప్తా నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ములుగు మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి దోసపాటి బిక్షపతి, కోశాధికారి రాచర్ల ఆంజనేయులు రమేష్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమసంఘం కమిటీ ఎన్నిక

చేర్యాల, సెప్టెంబరు 22: రెడ్డి సంక్షేమసంఘం చేర్యాల పట్టణ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా మిట్టపల్లి నారాయణరెడ్డి, అధ్యక్షుడిగా బొల్లు ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా మిట్టపల్లి నర్సిరెడ్డి, మంద లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఒల్లాద్రి రాజిరెడ్డి, కోశాధికారిగా బర్రె శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా అందె సుధాకర్‌రెడ్డి, బి. గురువారెడ్డి, ఆడిట్ కమిటీ మెంబర్లుగా పి.కొండల్ రెడ్డి, కర్క తిరుపతిరెడ్డి, సలహాదారులుగా ఆముదాల మల్లారెడ్డి, పుర్మ ఆగం రెడ్డి, సమ్మిరెడ్డి, సల్లారపు మహేందర్‌రెడ్డి, బొలుగం గాల్‌రెడ్డి, గంపల రాజలింగారెడ్డి ఎన్నికయ్యారు.

ఇసుకమేట.. తీసేదెట్ల



నాట్లు వేసిన పొలాల్లోకి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇసుక మేటలు చేరడంతో వాటిని ఎలా తొలగించాలో తెలియక రైతులు ఆందోళనం చెందుతున్నారు. వరద నీటితో కొట్టుకు వచ్చిన ఇసుక పొలాల్లో భారీగా చేరింది. ఈ పరిస్థితి మండలంలోని చాలా గ్రామాల్లో కనిపిస్తున్నది. ఇసుక మేటలను తొలగించడం కష్టతరంగా మారడంతో కొందరు రైతులు అలాగే వదిలివేస్తున్నారు.

- కుకునూరుపల్లి

రెవెన్యూ మంత్రిని కలిసిన నాగపురి

చేర్యాల, సెప్టెంబరు 22: రాష్ట్ర రెవిన్యూశాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని చేర్యాల మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, అతడి కుమారుడు నాగపురి కిరణ్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్‌తో పెనవేసుకున్న బంధంతో తమకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. దీంతో మంత్రి పొంగులేటి స్పందించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తప్పక ప్రాధాన్యం కల్పిస్తానని భరోసా ఇచ్చారు.

చెరువును నింపాలని వినతి

చేర్యాల, సెప్టెంబరు 22: చేర్యాల మండలం వీరన్నపేటలోని మిధునమ్మ చెరువును గోదావరి జలాలతో నింపాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వరదకాలువ లేనందున వర్షాకాలంలో చెరువుకు నీరుచేరడం లేదని, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి నింపాలని కోరారు. కొమ్మూరి స్పందించి దేవాదుల అధికారులతో మాట్లాడి చెరువును నింపాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చేర్యాల: పట్టణానికి చెందిన అగుల్ల సోమయ్య ఇటీవల మర ణించగా, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తంచేశారు. ఆయనవెంట మండలపార్టీ అధ్యక్షుడు కొమ్ము రవి ఉన్నారు.

'ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను సవరించాలి'

చేర్యాల, సెప్టెంబరు 22: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో లోపభూయిష్టంగా ఉండడంతో పాటు ప్రాథమిక పాఠశాలల మనుగడకు తీవ్ర విఘాతం కలిగించే విధంగా ఉన్నందున వెంటనే రద్దు చేయాలని టీజీ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్ డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్దుబాటు జరిగితేనే సులభతరం కానున్నా ఎఫ్ఎల్ఎన్ అమలవుతున్న ప్రస్తుత సమయంలో ఉన్నత పాఠశాల మాదిరిగా ప్రతీ తరగతికి ఒక టీచరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మిత్రుడి కుంటుబానికి అండగా..

చేర్యాల, సెప్టెంబరు 22: కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు దాసరి ప్రభాకర్ ఇటీవల చేర్యాల పట్టణ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించాడు. చిన్ననాటి మిత్రులు మృతుడి కుటుంబానికి చేయూతనందించారు. మృతుడి పిల్లల చదువుకోసం వ్యక్తిగత విరాళం పోగుచేసిన రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆదివారం మృతుడి కుటుంబసభ్యులకు డిపాజిట్ పత్రాన్ని అప్పగించారు.

● **కుకునూరుపల్లి:** స్నేహితుడి అంత్యక్రియలకు తోటి మిత్రులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంగోల్ గ్రామంలో చిన్ననాటి స్నేహితులు కలిసి మైత్రి ఫౌండేషన్ ఏర్పాటు చేసుకున్నారు. మైత్రి ఫౌండేషన్‌కి చెందిన సభ్యుడు గుమ్మడిదల స్వామి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. స్నేహితులందరూ కలిసి రూ. 15వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేందర్, నరసింహులు పాల్గొన్నారు.

తాగునీరు రాక ఇబ్బందులు

బెజ్జంకి, సెప్టెంబరు 22: ఐదు రోజులుగా తాగు నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల కేంద్రంలోని గాంధీ వీధి కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కాలనీ వాసులు మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా కావడం లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇంతకు ముందు రోజు విడిచి రోజు మంచి నీళ్లు వచ్చేవని, ఐదు రోజుల నుంచి నీళ్లు రాక సమీపంలోని బోరు మోటార్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీరు వచ్చేలా చూడాలని కోరారు.

సోలార్ వాటర్ హీటర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు

● ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

వర్గల్, సెప్టెంబరు 22: వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సోలార్ వాటర్ హీటర్లు మంజూరు చేసినట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 12వ తేదిన విద్యాలయంలో నిర్వహించిన యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు విద్యాలయంలో సమస్యలు, సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయ్యాలని విద్యార్థులు కోరడంతో స్పందించిన ఎంపీ విద్యాలయంలోని బాల బాలికల వసతి గృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయడానికి సుమారు రూ. 12.25 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం, విద్యార్థులు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

చేర్యాల, సెప్టెంబరు 22: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి కోరారు. ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం ప్రతినిధులకు కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసేందుకు నేషనల్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటుండగా, రాష్ట్రప్రభుత్వం రెడ్‌కార్పేట్‌తో స్వాగతించడం తగదన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం తగదని, ఈ విషయమై ఈనెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పూజ, మమత, కిరణ్, ప్రశాంత్, భరత్, సంతోశ్, ప్రవీణ్, అభి, షారుక్, మధు, నవనీత, అంజలి పాల్గొన్నారు.

కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి

గజ్వేల్, సెప్టెంబరు 22: ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం ఆయన సందర్శించి, విద్యార్థుల సమస్యలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇప్పటివరకు పెట్టెలు ఇవ్వలేదని, దుప్పట్లు, దోమ తెరలు చినిగిపోయాయని, కిటికీలు విరిగిపోయాయని, తిరగని ఫ్యాన్లతో విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారన్నారు. వర్షానికి స్లాబ్ పెచ్చులూడి ఎవరిపైన పడుతుందో తెలియని దుస్థితి నెలకొందన్నారు. హాస్టల్‌లో వర్షం పడితే నీటితో నిండుతుందని, విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సాయంత్రం వేళలో విద్యార్థులకు ట్యూటర్స్‌ను నియమించాలని, పకడ్బందీగా మెనూను అమలు చేయాలన్నారు. సకాలంలో విద్యార్థుల చదువులకు కాస్మోటిక్ చార్జీలు అందించి, విద్యార్థుల చదువుకు సహకరించాలని కోరారు.



ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఏగొండస్వామి



రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1977, 78, 79 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల 47 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు.

- రాయపోల్



గజ్వేల్ భారతి జూనియర్ కళాశాల 2007-2009 ఎంపీపీ గ్రూపు విద్యార్థులు మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు.

- మర్కుక్

ఆత్మీయ సమ్మేళనం



గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 లో పదోతరగతి చదివిన విద్యార్థులు 23 సంవత్సరాల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.

- గజ్వేల్ రూరల్

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, సెప్టెంబరు 22: కొమరవెల్లి మలికార్జునస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండపంలో పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. తమ కోరికలు నెరవేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చేర్యాల: గంగిరేగుచెట్టుకు ముడుపులుకట్టి ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆలయంలో కృత్తిక నక్షత్ర పూజలు

వర్గల్, సెప్టెంబరు 22: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కృత్తిక నక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మండపంలో భక్తులతో లక్ష పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దర్శనంతో పాటు క్షేత్రంలోని శ్రీవిద్యా సరస్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.



వర్గల్: విద్యాధరి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



చేర్యాల: మల్లన్న ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి